సీసీ రోడ్డు పనులు ప్రారంభం


నాగారం 4వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో మున్సిపల్ నిధులు వెచ్చించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులోని ప్రగతినగర్ కాలనీలో సుమారు రూ.8 లక్షల మున్సిపల్ నిధులు, గణేష్‌నగర్‌లో రూ.6 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ లక్ష్మీవేణుగోపాల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ 2వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.9 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు చైర్ పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ పనులు పూర్తికాగానే వాటర్ క్యూరింగ్ పనులు వెంటనే చేపట్టాలన్నారు. సీసీ పనుల్లో నాణ్యత లోపించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు విమలారెడ్డి, రెండో వార్డు అధ్యక్షుడు యాదగిరిరావు, శశికళ, శివ, ఆంజనేయులుగౌడ్, యాదయ్య పాల్గొన్నారు.


సీసీ పనులు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ రమాదేవి

చౌదరిగూడ అభివృద్ధిపై సమీక్ష సమావేశం


చౌదరిగూడలో గ్రామాభివృద్ధిపై చర్చిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడ పంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధిపై ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి సాంబశివరావు(ఆర్డీఏ), ఇతర అధికారులతో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి లేని కట్టడాలు, నాలా కబ్జా, మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల పురోగతిపై చర్చించారు. గ్రామంలో పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, ఏఈలు వెంకట్‌రెడ్డి, పరమేష్, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, నర్సింగ్‌ముదిరాజ్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలపై నీలినీడ..

'మినీ'మం.. స్పందన కరువు..

- 2022 జూన్ 15న స్టేడియం ప్రారంభం
- తూతూమంత్రంగా వసతుల కల్పన
- శంకుస్థాపన చేసి.. సభ ఏర్పాటు చేసి..
- ప్రారంభించిన అప్పటి మంత్రులు
- తర్వాత అటువైపు కన్నెత్తి చూడని వైనం..
- ఇప్పటికే పలుమార్లు క్రీడాకారుల వినతి
- నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నేటి ఆధునిక ప్రపంచంలో క్రీడలు కేవలం పోటీలకు మాత్రమే కాకుండా శారీరక శ్రమ, మానసిక ఉల్లాసానికీ ఉపయోగపడుతున్నాయి. క్రీడలతో వినోదం, ఉత్సాహంతో పాటు స్నేహసంబంధాలు పెరుగుతున్నాయి. క్రీడలు ఎన్నో రోగాల నుంచి విముక్తి కల్పిస్తున్నాయి. మనిషి శక్తిని కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఆటల్లో ప్రావీణ్యం సంపాదిస్తే పేరు ప్రతిష్టలే కాకుండా పలు మార్గాల్లో ఆదాయం సమకూరుతోంది. కానీ అనేక ప్రాంతాల్లో క్రీడలకు కనీస గౌరవం దక్కడం లేదు. క్రీడాకారులకు గుర్తింపు లభించడం లేదు. వారికి కనీస సౌకర్యాలు లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. – మేడ్చల్

మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద పారిశ్రామిక వాడలో 26 ఏళ్ల క్రితం నాటి ఎమ్మెల్యే దేవేందర్‌గౌడ్ రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. ఏ ముహూర్తాన శంకుస్థాపన చేశారో గానీ ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయినా స్టేడియం రాత మాత్రం మారలేదు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని 2022 జూన్ 15న స్టేడియం ప్రారంభమైంది. అప్పుడు మంత్రిగా ఉన్న కేటీఆర్ ప్రారంభించగా స్టేడియంకు హడావుడిగా మరమ్మతులు చేసి ఆట స్థలాన్ని చదును చేయించి పాతవాటికి రంగులు వేసి తెలంగాణ క్రీడా ప్రాంగణంగా పేరు మార్చారు.

నిర్మించే తీరు ఇది కాదు..

స్టేడియం ప్రారంభోత్సవ సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ స్టేడియం నిర్మాణం తీరును తప్పుబట్టారు. నిర్మించే తీరు ఇది కాదని మంత్రి మల్లారెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులు ఒకసారి సిరిసిల్లకు వెళ్లి అక్కడ నిర్మించిన మినీ స్టేడియంను పరిశీలించి వచ్చి మోడల్ స్టేడియంగా నిర్మించాలని వారికి సూచించారు. అయినా ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వీడలేదు. దీంతో స్టేడియం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారైంది.


స్టేడియం ఆవరణలో పిచ్చిమొక్కలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

స్టేడియం ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా మారింది. గ్రౌండ్ ఏ మాత్రం ఉపయోగకరంగా లేకుండా పోయింది. గ్యాలరీకి రంగులు వేసినా అధ్వానంగా మారింది. గ్యాలరీ వెనుక భాగం పశువుల దొడ్డిగా తయారైంది. ఆవరణలో ఏర్పాటు చేసిన భవనం వృథాగా ఉండిపోయి పాలకుల తీరును వెక్కిరిస్తోంది. అప్పుడు ఏర్పాటు చేసిన బోర్డు సైతం చిరిగిపోయింది. ఆట స్థలం రాళ్లతో నిండిపోయింది. పాలకులు గొప్పలకు పోయి హడావుడిగా ప్రారంభించిన స్టేడియాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉండటం, రక్షణ లేకపోవడంతో స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. తాగుబోతులు, పేకాటరాయుళ్లు, వ్యభిచారానికి అడ్డాగా మారినా పాలకులకు కనువిప్పు కలగడం లేదు. పలుమార్లు క్రీడాకారులు విన్నవించినా నిర్లక్ష్యం వీడటం లేదు.




పశువుల దొడ్డిగా గ్యాలరీ కింది భాగం(ఇన్‌సెట్‌లో) మంత్రి కేటీఆర్ వేసిన శిలాఫలకం

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: రాజబొల్లారం సబ్ స్టేషన్ పరిధిలోని రాజబొల్లారం తండా ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. రాజబొల్లారం తండా, గుబ్బడి తండాల్లో, తండాల పరిధిలోని అన్ని వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

శామీర్‌పేట్: అలియాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. లాల్‌గడి మలక్‌పేట 33/11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లాల్‌గడి మలక్‌పేట గ్రామంతో పాటు గుబ్బ కంపెనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: విధుల నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ చట్టపరంగా చేయాల్సిన పనులు చేయడం లేదని మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ విఘ్నేష్‌పై మేడ్చల్‌కు చెందిన జి.మహేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీసీ కాపీల కోసం టీయాప్ ద్వారా ఈ నెల 13న దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో ఆయన చుట్టూ తిరుగుతున్నా సీసీ కాపీలు ఇవ్వడం లేదని, అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను సందర్శించిన విద్యార్థులు


ఫుడ్ ప్రాసెసింగ్ వివరాలు తెలుసుకుంటున్న అనురాగ్ విద్యార్థులు

ఘట్‌కేసర్: పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు పారిశ్రామిక సందర్శన జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని అనురాగ్ యూనివర్సిటీ ఎంబీఏ విభాగం అధిపతి డాక్టర్ వి.విష్ణువర్ధన్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 65 మంది ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు మంగళవారం అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అందులో జరిగే ఫుడ్ ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ కల్పన, శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ దాతలు ధర్మకర్తలు కాదు

మేడ్చల్: ఆలయాన్ని నిర్మించే వారు ఆలయాల ధర్మకర్తలు కారని అత్వెల్లి వేంకటేశ్వర ఆలయం ధర్మకర్తలు నరహరిచారి, సుదర్శనచారి, రవికుమార్‌చారి అన్నారు. అత్వెల్లి వేంకటేశ్వర ఆలయ ఆవరణలో శివాలయం ఉప ఆలయంగా ఉందని, శివాలయాన్ని గ్రామానికి చెందిన వారు నిర్మించి ఆలయ ధర్మకర్తలుగా ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. అత్వెల్లి వేంకటేశ్వర ఆలయానికి తమ కుటుంబం అనువంశిక ధర్మకర్తలమని వేంకటేశ్వర ఆలయానికి శివాలయం ఉపాలయంగా ఉందని తెలిపారు. ఆలయాన్ని నిర్మించినంత మాత్రాన ధర్మకర్తలు కారని కేవలం నిర్మాణ దాతలు మాత్రమే అన్నారు. ఆలయ నిర్మాణ దాతలు తాము ధర్మకర్తలమనే ప్రచారం మానకపోతే దేవాదాయ చట్టం 30/87లోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ


కీసరగుట్టలో పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ వినూత్నరెడ్డి

కీసర: మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు మండల పంచాయతీ అధికారి వినూత్నరెడ్డి అన్నారు. కీసరగుట్టలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామకార్యదర్శి గంగన్న, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభినందనలు


అభినందనలు తెలుపుతున్న ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్

ఘట్‌కేసర్: రాజ్యసభ ఎన్నికల్లో ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనిల్‌కుమార్‌ను ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, దేవేందర్‌ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

కెమికల్ వాటర్ వదులుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: బోడుప్పల్ రా చెరువులోకి కెమికల్ వాటర్ వదులుతున్న ఇండస్ట్రియల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం రా చెరువు పైభాగంలో ఉన్న మొండి కత్వను ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ యజమానులు 10 అడుగుల పైపులైన్లు వేసి వాటి ద్వారా కెమికల్ వాటర్‌ను రా చెరువులోకి వదులుతున్నట్లు వెల్లడించారు. ఇదే విషయమై మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. కెమికల్ వాటర్ వదులుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పడతం లోకేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కీసర: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం కీసరగుట్ట కమాన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామలింగంపల్లికి చెందిన హేమంత్‌రెడ్డికి చెందిన టాటా ఎలక్ట్రికల్ కారును డ్రైవర్ నవీన్ వేగంగా రామలింగంపల్లి నుంచి కీసర వైపు నడుపుకుంటూ వస్తూ కీసరగుట్ట కమాన్ సమీపంలో గల ఎస్ఎల్ఎంఐ కంపెనీ సమీపంలో మొదటగా బైకును వేగంగా ఢీకొట్టాడు. అనంతరం రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు డ్రైవర్ నవీన్‌తో పాటు, ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దెబ్బతిన్న కారు

సిరిపురం యాదయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి


ఎన్ఎఫ్‌సీనగర్‌లో నివాళులర్పిస్తున్న రచయిత అందెశ్రీ

ఘట్‌కేసర్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన సిరిపురం యాదయ్య ప్రాణ త్యాగం చేసిన స్థలంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రచయిత అందెశ్రీ అన్నారు. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీ నగర్ పిట్టల ఆర్గానిక్ పరిధిలో తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ జర్నలిస్ట్ శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సిరిపురం యాదయ్య 14వ వర్ధంతి కార్యక్రమానికి ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) ఎన్‌సీసీ గేటుకు సిరిపురం యాదయ్య పేరును నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మారావు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ, శంకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


వివరాలు తెలుపుతున్న వెంకట్‌రెడ్డి

మల్కాజిగిరి: పిల్లి నర్సింగరావు కాలనీ(ఆర్టీసీ కాలనీ)లో పీఎస్ఆర్ సొసైటీకి చెందిన స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో ప్రస్తుతం కాలనీ ఉన్న ప్రాంతం నిరుపయోగంగా ఉండేదని, పేద ప్రజలు గుడిసెలు వేసుకొని జీవనం సాగించారన్నారు. సీపీఎం పార్టీ వారి తరఫున పోరాటం చేసిందన్నారు. తొలుత ప్రభుత్వ స్థలంగా భావించినప్పటికీ ప్రైవేట్ స్థలం కావడంతో భూమి యజమాని యూసఫ్‌బేగంతో చర్చించడంతో పేద ప్రజలకు స్థలం ఇవ్వడానికి ఒప్పుకున్నారన్నారు. 2010 మార్చి నెలలో సొసైటీ పేరున 3 ఎకరాల 28 గుంటలు రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. 42 గజాల చొప్పున సుమారు 316 మందికి సొసైటీ స్థలాన్ని కేటాయించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో అక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్నామన్నారు. పలువురు ఆ స్థలం తమదేనంటూ కోర్టుకు వెళ్లారని, ఆధారాలు లేకపోవడంతో కేసు కొట్టివేశారన్నారు. ఇప్పుడు మళ్లీ కొంత మంది స్థలం తమదే అంటూ నిర్మాణాలు చేపట్టారని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కాలనీ సంఘం నాయకులు గణేష్, మంగ తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి పథకానికి ఆఖరి తేదీ నేడే

ఘట్‌కేసర్: విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 21 ఆఖరు తేదీ అని టీఎస్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పొందేందుకు తప్పనిసరిగా గృహజ్యోతి పథకం కింద నమోదు చేసుకోవాలన్నారు. సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు అందజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంస్కృతి పార్కును పరిశీలించిన అధికారులు



పోచారం: సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఆక్సిజన్ పార్కును ఉద్యానవన శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ఉత్తమ ఉద్యానవన అవార్డుల పంపిణీ కోసం జరుగుతున్న ఎంపిక ప్రక్రియలో భాగంగా గార్డెన్ ఫెస్టివల్ టీమ్ పోచారానికి విచ్చేసింది. ఈ సందర్భంగా పార్కులో ఉన్న వసతులు, పచ్చదనం, నిర్వహణ, పరిశుభ్రత వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. పార్కు గురించి అధికారులు అడిగిన వివరాలను కౌన్సిలర్ హరిప్రసాదరావు తెలియజేశారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు 30 నెలల జైలు

మేడ్చల్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు మేడ్చల్ న్యాయస్థానం 30 నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. మంచిర్యాల జిల్లాకు చెందిన సుచిన్‌రెడ్డి, నీరజరెడ్డిలకు 2017లో వివాహమైంది. నీరజరెడ్డి భర్త వేధింపులు భరించలేక 2017 సంవత్సరం జులై 3న ఆత్మహత్య చేసుకుంది. నీరజ తల్లితండ్రులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రమేష్ మృతి చెందిన నీరజ భర్త సుచిన్‌రెడ్డికి 30 నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు.

దేశంలో మూడోసారి బీజేపీదే అధికారం

కీసర: దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు అన్నారు. కీసర ఓఆర్ఆర్ సమీపంలోని ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఫాంహౌజ్‌లో 25వ తేదీన మేడ్చల్ నియోజకవర్గంలో ప్రారంభంకానున్న విజయ సంకల్ప రథయాత్ర విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై బీజేపీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈసారి రాష్ట్రంలో 10 పార్లమెంట్ సీట్లు బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. ఇక మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ను సైతం బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు.



ఇందుకోసం బీజేపీ నేతలంతా పార్లమెంట్ ఎన్నికలు అయ్యేంత వరకు పట్టుదలతో పార్టీ కోసం పనిచేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, నేతలు అమరమోహన్‌రెడ్డి, విజయేందర్, రాగుల అశోక్, దేశం మల్లేష్‌గౌడ్, కొలిచెలిమి కృష్ణ, బాపిరెడ్డి పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

- పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అధికార యంత్రాంగం చర్యలు
- అర్హులైన వారందర్నీ ఓటరు జాబితాలో చేర్చేందుకు కసరత్తు
- ఏప్రిల్ 1 నాటికి 18ఏళ్లు నిండిన వారందరూ అర్హులే..
- విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు
- యువత ముందుకొస్తే మేలంటున్న ఎన్నికల సంఘం

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నిలకు అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. యువతకు మరోసారి ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

పోలింగ్ శాతన్ని పెంచేందుకు..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని అధిగమించేలా ఈ సారి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. అర్హులైన యువతీ, యువకుల పేర్లు నమోదు చేయడంతో పాటు మార్పులు చేర్పులు, పేర్ల తొలగింపునకు అవకాశం ఇచ్చారు. ఆన్‌లైన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత ఫారాలు (పత్రాలు) పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంటుంది.

విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు

ఓటరుగా పేరు నమోదుపై అధికార యంత్రాంగం ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉంటే వారి పేరును అక్కడే ఓటరుగా నమోదు చేయిస్తారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై వివరించడంతో పాటు దాని ప్రాధాన్యత, ప్రాముఖ్యతను పేర్కొంటారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అన్ని కళాశాలల్లో స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

యువత ముందుకొస్తే మేలు..

ఇటీవల రెండు పర్యాయాలు ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 8న తుది ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల సంఘం విడుదల చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓటర్లు 28,75,907 మంది ఉన్నట్లు తేలింది. మరోసారి ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చిన దృష్ట్యా యువత స్పందించాలని కోరుతున్నారు. తమ పేరు నమోదు చేసుకోవాలని పేర్కొంటున్నారు.

తుది ఓటర్ల జాబితా ప్రకారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ల వివరాలు..

పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
2,439	14,83,448	13,92,074	385	28,75,907

శ్రీసాయినగర్ కాలనీలో ఖడ్గపూజ

బోడుప్పల్: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బీజేపీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అన్నారు. బోడుప్పల్ 14వ డివిజన్‌లోని శ్రీసాయినగర్ కాలనీలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఖడ్గపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ జాతి రక్షణకు శివాజీ నడుం బిగించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా స్పెషల్ ఇన్వైట్ సిలివేరు శంకర్, మేడ్చల్ రూరల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గొల్లపూడి విజయ, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్, జైకిషన్, సురేష్, పురుషోత్తం, నవీన్ పాల్గొన్నారు.